www.mb9news.in
R.NO : TS-11-0011054

# మన భద్రాద్రి న్యూస్

మన అక్షరం....... ప్రజల ఆయుధం

డిజిటల్ తెలుగు దినపత్రిక

బుధవారం 25, జూన్ 2025

## నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పిన డిప్యూటీ సీఎం..!

– త్వరలో మరో 30 వేల ఉద్యోగాలు..!

2 లో..



# రైతులను రాజులను చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం..!

- వ్యవసాయం దండగ కాదు.. పండగ లా చేస్తాం
- దేశంలోనే తెలంగాణను అగ్రభాగాన నిలబెట్టాం..!
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



2 లో..



హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, జూన్ 24 : తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేంతవరకు ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలబడుతూనే ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వ్యవసాయం దండుగ కాదు..పండుగ. రైతులను రాజులను చేయడమే లక్ష్యంగా పని చేస్తామని పునరుద్ఘాటించారు. రైతు భరోసా కింద ఈ నెల 16 వ తేదీన రైతు ఖాతాల్లోకి డబ్బు వేయడం ప్రారంభించినప్పటి నుంచి చెప్పిన మాట ప్రకారం 9 రోజుల్లోగా 9 వేల కోట్ల రూపాయలను 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేయడం పూర్తయింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడే వారికి తప్పకుండా పదవులు

– ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్

2 లో..



## మళ్లీ తెలంగాణకు ఐఏఎస్ ఆమ్రపాలి

2 లో..



## వ్యవసాయం అంటే రైతు భరోసా ఒక్కటేనా..?

– ప్రభుత్వం పై మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్



2 లో..

# రైతులను రాజులను చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం..!



మొదటి పేజీ తరువాయి

డా.బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో రైతులు ప్రత్యక్షంగా పాల్గొనడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 16 వందల రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు వీక్షించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి పాల్గొన్న ముఖ్యమంత్రి.. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. గతంలో చెప్పినట్టుగానే 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశాం. ఎకరాకు 12 వేల చొప్పున 1 కోటి 40 లక్షల ఎకరాలకు 70 లక్షల రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటున్న ఈ శుభ సందర్భంగా రైతులందరికీ అభినందనలు.

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వానికి రైతులు మొదటి ప్రాధాన్యత. ఆ తర్వాత క్రమంలో మహిళలు, తెలంగాణ ఉద్యమకారులైన యువతకు ప్రాధాన్యతనిస్తున్నాం. అందుకే అధికారం చేపట్టిన కొద్ది రోజుల్లోనే రైతు భరోసా కింద 7,625 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశాం. వచ్చే పదేండ్లలో వ్యవసాయాన్ని పండుగ చేస్తాం. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో 25,35,964 మంది రైతులకు సంబంధించి 20,617 కోట్ల రూపాయలు చెల్లించి రుణ విముక్తులను చేశాం. ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు చెల్లించడమే కాకుండా సన్న వడ్లు పండించిన వారికి బోనస్ ఇస్తున్నాం. 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేసి దేశంలోనే అత్యధిక దిగుబడిని ఇచ్చి గర్వంగా చెప్పుకునే రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టారు.

రైతాంగానికి అండగా నిలబడాలన్న లక్ష్యంతోనే రుణ మాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్, ఉచిత కరెంట్, స్ప్రింక్లర్స్, డ్రిప్, సోలార్ గిరి వికాసంలో పంపుసెట్లు, సివిల్ సప్లయ్ విభాగం ద్వారా ధాన్యం కొనుగోలు.. ఇలా కేవలం 18 నెలల కాలంలో వ్యవసాయ రంగంపై 1 లక్ష 04 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసిన ప్రజా ప్రభుత్వం ఇది. ప్రజా పాలనలో రైతులు, మహిళలు, యువకుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సోలార్ పవర్ ప్లాంట్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ, స్కూలు పిల్లల యూనిఫామ్ కుట్టించే బాధ్యత అప్పగించడం, స్వయం సహాయ సంఘాలకు సహాయం... ఇలా కోటి మంది కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టాం. అధికారం చేపట్టిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ఇటీవల ప్రకటించిన రాజీవ్ యువ వికాసం ద్వారా యువకులను ఆదుకునే ప్రణాళికలతో ముందుకు వస్తాం. తదుపరి కార్యక్రమంగా రాజీవ్ యువ వికాసం చేపడుతాం. ప్రజా పాలనలో రైతులు, మహిళలు, యువకులు భద్రంగా ఉండాలన్నదే మా ఆకాంక్ష.

గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం అన్ని రకాలుగా పోరాడుతాం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాలని కేంద్రానికి ఫిర్యాదు చేశాం. ఒకవేళ కేంద్రం ప్రాజెక్టుకు అనుమతిస్తే న్యాయస్థానాల్లో పోరాడుతాం. బనకచర్లపై కేంద్ర ప్రభుత్వం ముందు రాష్ట్రం తెలిపిన అభ్యంతరాల విషయంలో అసెంబ్లీలో చర్చకు సిద్ధం.. అని ముఖ్యమంత్రి వివరించారు.

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పిన డిప్యూటీ సీఎం..!

హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, జూన్ 24

కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం.. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. రైతు భరోసా మూలంగా రాష్ట్రంలో సాగు యోగ్యమైన 1.49 కోట్ల ఎకరాలకు 69.70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి 9 వేల కోట్లు వేశామని చెప్పారు. సన్నధాన్యం సాగు చేస్తున్న రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ రూపంలో ఈరోజు వరకు 1,199 కోట్ల రూపాయలు రైతులకు ప్రజా ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. రైతన్నకు ఊహించని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి భరోసా ఇచ్చేందుకు రైతు బీమా పథకాన్ని అమలు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ పథకం కింద 42.16 లక్షల మంది రైతులకు భీమా అందించామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పారు. ఇప్పటికే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని.. మరో 30 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయనున్నామని స్పష్టం చేశారు. "నిరుపేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ప్రారంభిస్తున్నాం. ప్రతి పాఠశాల 25 ఎకరాల్లో.. 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నాం. మొదటి సంవత్సరం 58 పాఠశాలలు నిర్మించేందుకు 11,600 కోట్లు కేటాయించాం, రాష్ట్రంలోని 3.10 కోట్ల మంది పేదలకు ఉగాది నుంచి సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. సన్న బియ్యం కోసం ప్రతి సంవత్సరం 13,525 కోట్లు ఖర్చు చేస్తుంది. రాష్ట్రంలోని సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. ఇందుకుగాను తాజా బడ్జెట్లో 23,373 కోట్లు కేటాయించాం." అని భట్టి వ్యాఖ్యానించారు.

# పార్టీ కోసం కష్టపడే వారికి తప్పకుండా పదవులు

హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, జూన్ 24

ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలకు శుభవార్త చెప్పారు. పార్టీ కోసం కష్టపడే వారికి తప్పకుండా వివిధ కమిటీలలో, రాజకీయంగా అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో బలోపేతం చేయడానికి క్షేత్రస్థాయి సమీక్షలు నిర్వహిస్తున్నామని మీనాక్షీ తెలియజేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పంచాయతీ సంఘటన్ కీలక పాత్ర పోషించాలని సూచించారు.

పార్టీలో అంతర్గత విభేదాలు, కొత్త నాయకులతో సమన్వయ లోపాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ప్రతి జిల్లాకు ఇద్దరు అబ్జర్వర్‌లను నియమించి కమిటీలలో నిబద్ధత కలిగిన కార్యకర్తలను గుర్తించాలని సూచించారు. 42 శాతం బీసీ కోటా, ఎస్సీ వర్గీకరణ, కుల గణన వంటి ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేయాలని, బీజేపీ, బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను ఎదుర్కోవాలని కార్యకర్తలకు మీనాక్షీ నటరాజన్ పిలుపునిచ్చారు.



# వ్యవసాయం అంటే రైతు భరోసా ఒక్కటేనా..?



హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, జూన్ 24

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుభరోసా నిధుల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా రాష్ట్ర సచివాలయం ఎదుట 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని నిర్వహించారు. తాజాగా ఈ కార్యక్రమంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. దశాబ్దాల పాటు వ్యవసాయాన్ని దండగ చేసిందే కాంగ్రెస్ పాలకులు అని ఫైర్ అయ్యారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం వచ్చాకే మళ్లీ రైతులకు మంచి రోజులు వచ్చాయని.. రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా మారిందని అన్నారు. ఇప్పుడు మళ్లీ ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో రైతులు పాత రోజులు గుర్తు చేసుకుంటున్నారని విమర్శించారు. రూ.10 వేల రైతుబంధు స్థానంలో రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని ఓట్లు దండుకుని.. రూ.12 వేలకు కుదించడం సంబరమా? అని ప్రశ్నించారు. అసలు వ్యవసాయం అంటే రైతుభరోసా ఒక్కటేనా? అని సీరియస్ అయ్యారు.

'సాగు నీటితో రైతుకు ప్రోత్సాహం ఇచ్చి, ఉచిత కరెంటుతో సాగుకు ఊతమిచ్చి, పంట పెట్టుబడికి రైతుబంధుతో వెన్నుదన్నుగా నిలిచి, మట్టిని నమ్ముకున్న రైతు కుటుంబాలకు రైతు ఏ కారణం చేత మరణించినా రూ.5 లక్షల రైతుబీమాతో ధీమానిచ్చి, వందశాతం పంటల కొనుగోళ్లతో వ్యవసాయానికి భరోసానిచ్చిన దార్శనికుడు కేసీఆర్ అని అన్నారు. కరోనా విపత్తులోనూ కర్షకుల కష్టాలను గుర్తించి ఆదుకున్నాడని గుర్తుచేశారు. కాంగ్రెస్ మోసాలకు గుణపాఠం తప్పదు.. జాగో రైతన్నా జాగో.. జాగో తెలంగాణ జాగో' అని సోషల్ మీడియా వేదికగా కేటీఆర్ పోస్టు పెట్టారు.

# మళ్లీ తెలంగాణకు ఐఏఎస్ ఆమ్రపాలి

హైదరాబాద్, మన భద్రాద్రి బ్యూరో, జూన్ 24

ఐఏఎస్ అధికారి ఆమ్రపాలి కి క్యాట్ శుభవార్త చెప్పింది. ఏపీ నుంచి తిరిగి మళ్లీ తెలంగాణ కు కేటాయించింది. ఈ మేరకు మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, కొన్ని నెలల క్రితం ఏపీ, తెలంగాణ కేడర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ కేడర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. తమను తెలంగాణకే కేటాయించాలన్న పలువురి అభ్యంతరాలనూ తోసిపుచ్చింది. కేంద్రం ఆదేశాలతో తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి కాట, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్, ప్రశాంతి ఏపీలో విధులు నిర్వర్తించారు. తాజాగా మళ్లీ ఆమ్రపాలిని తెలంగాణకు కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో ఆమ్రపాలి కాట గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు.



# మన్నెంలో 'రాహుల్ రేలా'..!

- అడవి బిడ్డలకు కొండంత అండ
- గిరిజన ప్రగతికి కీలక అడుగులు
- పదునైన ప్రణాళికలతో ఫలితాలు
- ఏడాది పాలనలోనే యువ ఐఏఎస్ మార్క్
- రాహుల్ రాకతో ఐటీడీఏ అభివృద్ధి ఉరకలు
- (భద్రాచలం ఐటీడీఏ పీవో గా బాధ్యతలు చేపట్టి జూన్ 25 తో సంవత్సరం పూర్తి కావస్తున్న సందర్భంగా పిఓ రాహుల్ పాలన సక్సెస్ స్టోరీ )







భద్రాచలం, మన భద్రాద్రి బ్యూరో, జూన్ 24

ఆరడుగుల బుల్లెట్. అభివృద్ధిలో రాకెట్. అఖిల భారత విజ్ఞాన ఖని. తెలుగు కవి.అడవి బిడ్డలకు అండదండ.మన్యమంతా రేలా జెండా. ఆయనే యువ ఐఏఎస్ ఆఫీసర్ 'గిరిజన బాంధవుడు' బి.రాహుల్. సక్సెస్ కు కేరాఫ్. భద్రాచలం ఐటిడిఎ పిఓగా ఏడాది కాలంలోనే అద్భుతాలు సృష్టించి...మరో 'అల్లూరి'గా గిరిజనులకు అండగా నిలిచారు



- రాహుల్ రాకతో మన్యానికి మహర్దశ...

భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ గా యువ ఐఏఎస్ ఆఫీసర్ బి.రాహుల్ 2024 జూన్ 25న బాధ్యతలు చేపట్టారు. చూడటానికి వయస్సులో చిన్నవాడైన బహు మేధావి. ప్రతీ పని ప్రణాళికలతోనే ముందడుగు వేశారు. తత్ఫలితంగా సత్ఫలితాలు సాధించారు. మన్యానికి రాహుల్ రాక ఏజెన్సీకి మహర్దశ పట్టిందని చెప్పవచ్చు

మిగతా 4 లో....













# మన్నెంలో 'రాహుల్ రేలా'..!










**- విద్యా ప్రగతికి విశేషంగా కృషి**

గిరిజన ప్రగతి విద్యతోనే సాధ్యమవుతుందని విశ్వసించారు. అందుకే తన ఏడాది పాలనలో విద్య పైన ప్రధాన దృష్టి సాధించారు. విద్యాభివృద్ధికి కంకణ బద్ధులై అనేక విప్లవాత్మక విద్యా సంస్కరణలు తీసుకొచ్చారు. ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్, ప్రీ మెట్రిక్ హాస్టల్స్, జిపిఎస్ పాఠశాలలో ఇలా దాదాపు 348 విద్యాసంస్థల్లో చదువుతున్న దాదాపు 30,854 మంది బాలబాలికల విద్యా ప్రగతికి తనదైన శైలిలో పావులు కదిపారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో 32 గిరిజన గురుకుల విద్యాలయాలలో విద్యనభ్యసిస్తున్న దాదాపు 12,897 మంది విద్యార్థినీ, విద్యార్థుల అభ్యున్నతికి అహర్నిశల పాటుపడ్డారు. ప్రాథమిక దశలో సరైన పునాది పడితే అది ప్రగతికి దోహదపడుతుందని విశ్వసించిన పిఓ రాహుల్ ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్థుల నైపుణ్యం పెంపుదలకు ఉద్దీపకం వర్క్ బుక్కులను అందుబాటులోకి తీసుకొచ్చారు. పిల్లలకు కష్టంగా ఉండే గణితము, ఆంగ్లం తదితర సబ్జెక్టులలో నిష్ణాతుల చేత వర్క్ బుక్కులను తయారు చేపించి గిరి బిడ్డలకు పటిష్టమైన విద్యను అందిస్తున్నారు. పిఓ చర్యలతో నేడు గిరి పిల్లలు వేదిక్ మాథ్స్ మరియు ఆంగ్ల భాష నైపుణ్యాన్ని పెంపొందించుకుంటున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధనకు ప్రతి పాఠశాలకు ప్రత్యేక అధికారులను నియమించడంతో ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో దాదాపు 26 స్కూల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించటం గమనార్హం. టెన్త్ బాల బాలికలకు స్పెషల్ మెనూ, గ్రాఫ్, మ్యాప్ పాయింటింగ్, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, మెటల్ స్కేళ్ళు, ఎగ్జామ్ ఫ్యాడ్, జామెంట్రీ బాక్స్ తదితర అత్యవసరాలను అందించి టెన్త్ పిల్లలను ఎంతగానో ప్రోత్సహించటం జరిగింది. దీంతో సత్ఫలితాలు సాధించటం విశేషం. ఐటీడీఏ స్థాయిలో పదవ తరగతి బాల బాలికలకు ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష 2025 నిర్వహించి ప్రత్యేక ప్రోత్సాహం అందించటం జరిగింది. తరచూ విద్యాసంస్థలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఆయా విద్యా సంస్థల నిర్వాహకులను అలర్ట్ చేయడం జరిగింది. పాఠశాలల తనిఖీ సందర్భంలో స్వయంగా పిల్లలకు పాఠాలు బోధించి, తగు మెలకువలు చూపించి వారిని ప్రోత్సహించిన సందర్భాలు కోకొల్లలు. విద్య సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. మరమ్మత్తుల పనులకు ఒక్కో విద్యాసంస్థకు రూ.40 వేల చొప్పున రూ. 6,22,030 నిధులను వెచ్చించి పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నారు. గిరిజన పిల్లలు చదువులోనే కాకుండా ఆటపాటల్లో రాణించేలా పిఓ రాహుల్ తనదైన శైలిలో చర్యలు తీసుకున్నారు. విద్యాసంస్థల్లో క్రీడా స్థలాలను గుర్తించి పిల్లలకు క్రీడ తర్ఫీద్ ఇప్పించారు. రూ.25 లక్షలతో క్రీడా పరికరాలు కొనుగోలు చేసి విద్యాసంస్థల్లో అందుబాటులో ఉంచారు. ఉట్నూర్ నందు 2024-25 సంవత్సరంలో జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా పోటీల్లో భద్రాచలం ఐటిడిఏ జోన్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ ను సాధించటం గమనార్హం. గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత విద్య పై అవగాహన పెంపొందించేందుకు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంను ప్రారంభించి అమలు చేశారు. ఈ ప్రోగ్రాం నచ్చిన గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ అన్ని గిరిజన విద్యా సంస్థల్లో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు చర్యలకు ఉపక్రమించటం పిఓ రాహుల్ సక్సెస్ విద్యా సంస్కరణలకు నిలువుటద్దంగా చెప్పవచ్చు. ఐఐటి, ఎన్ఐటి, ఎంబీబీఎస్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, లా, పాలిటెక్నిక్ తదితర కోర్సుల్లో సీట్లు సాధించిన గిరిజన పిల్లలకు ఐటీడీఏ తరఫున ఆర్థిక సహకారం, లాప్టాప్ లు అందించి తగు ప్రోత్సాహం ఇవ్వటం జరిగింది. క్రీడల్లో మెరుగైన ప్రతిభ చాటిన వారికి కూడా ఆర్థిక సహకారం చేశారు

**- ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక కృషి**

గిరి బిడ్డలకు విద్య అవకాశాలకు పెద్ద పీట వేయటమే కాకుండా వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోసం పిఓ రాహుల్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉద్యోగాలు సంపాదించి జీవనోపాధి పెంపొందించుకోవడానికి గిరిజన యువతకు వివిధ ఉద్యోగ,ఉపాధి కోర్సులలో శిక్షణ అందించి వారికి తోడ్పడుతున్నారు. బి.టి.పి.ఎస్, ఐటిసి, జెన్కో ప్రతినిధులతో మాట్లాడి గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేశారు.

డీఎస్సీ, నీట్, పోలీస్, ఎస్ఐ వివిధ గ్రూప్ పరీక్షలకలో నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ప్రత్యేక నిష్ణాతులచే కోచింగ్ ఇప్పిస్తున్నారు. భద్రాచలం పట్టణంలో గ్రంథాలయానికి 25 లక్షల రూపాయల ఖర్చుతో రీడింగ్ రూమ్ నిర్మాణం చేపట్టారు. నిరుద్యోగులకు గ్రంథాలయం ఎంతగానో సౌకర్యంగా మారింది. గిరిజన యువత శిక్షణ కేంద్రంలో కస్టమర్ రిలేషన్షిప్ మేనేజ్మెంట్ కోర్సులో 35 మంది యువతకు ఉచిత శిక్షణ అందించి 34 మందికి ప్రైవేట్ కంపెనీలో ఉపాధి కల్పించడం జరిగింది. ఐటీసీ ప్రదం ద్వారా భద్రాచలంలో పిటీషన్ కోర్సులో 87 మందికి, బూర్గంపహాల్లో అసిస్టెంట్ ఎలక్ట్రిషన్ 169 మంది యువతకు ఉచిత శిక్షణ అందించి 194 మందికి ప్రైవేట్ కంపెనీలో ఉపాధి కల్పించడం జరిగింది. స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా 654 మంది యువతకు నాక్ మరియు ఆర్ సి టి ఖమ్మం ద్వారా శిక్షణ ఇప్పించారు.

**- గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకై**

మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివాసముంటున్న గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ఐటీడీఏ పీవో రాహుల్ ప్రత్యేక దృష్టి సారిస్తూ వస్తున్నారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రి మొదలుకొని ఏజెన్సీలో ఉన్న పీహెచ్సీలను క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తూ వైద్యులు ఎప్పుడు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టారు.మందులు, వ్యాక్సిన్లు ఎప్పుడు అందుబాటులో ఉండే విధంగా కృషి చేశారు. పీహెచ్సీ ఆవరణలో గిరిజనులకు ఇబ్బందులు కలగ కుండా సిసి రోడ్లు, ఎమర్జెన్సీ ఇతర విభాగాల్లో ఆధునీకరణ పనులు,కొత్త పీహెచ్సీల నిర్మాణం, సిబ్బందిని సర్దుబాటు చేయడం, మారుమూల ప్రాంత పీహెచ్సీలకు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటుకు కృషి చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న గిరిజనులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తూ, ప్రమాద బీమా పథకాలు అందించడానికి కృషి చేశారు. తల్లి ఆరోగ్యం పోషకాహార కార్యక్రమం, గర్భిణీ స్త్రీల నమోదు, ప్రసూతి సేవలు, అసంక్రమణ వ్యాధుల కార్యక్రమం, ఆలన, ఈ సంజీవని, తెలంగాణ డయాగ్నస్టిక్, జాతీయ క్షయ నివారణ, కుష్టు వ్యాధి నిర్మూలన తదితర ప్రభుత్వ కార్యక్రమాలను భద్రాచలం ఐటీడీఏ పరిధిలో విజయవంతంగా నిర్వహించడంలో తనవంతు పాత్ర పోషించారు

**- గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ద్వారా పలు అభివృద్ధి పనులు**

గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ద్వారా పిఓ పలు అభివృద్ధి పనులను నిర్వహించారు. గ్రామ పంచాయతీ భవనముల పథకం కింద ఐటీడీఏ పరిధిలోని 1999 గ్రామ పంచాయతీ భవనములు మంజూరు కాగా, రూ. 3980.00 లక్షలతో పనులు చేపట్టడం జరిగింది. ఇప్పటికే ఇందులో 53 పనులు పూర్తికాగా, మరో 51 పనులు ప్రారంభ దశలో ఉన్నాయి. మరో 95 పనులు పురోగతిలో ఉన్నవి. గిరిజన భవనముల పథకం కింద 7 గిరిజన భవనములకు రూ. 760.00 లక్షలు మంజూరు కాగా వీటిలో ఐదు పనులు పూర్తి కాగా మరో రెండు పనులు పురోగతిలో ఉన్నాయి. గురుకుల పాఠశాల భవనముల పథకముల కింద 12 గురుకుల



పాఠశాల భవనములకు రూ. 5520.00 లక్షలు మంజూరైతే ఇందులో ఆరు పనులు పూర్తికాగా మరో ఐదు పనులు పురోగతిలో ఉన్నాయి. మరొకటి ప్రారంభ దశలో ఉంది. ఎస్ టి ఎస్ డి ఎఫ్ పథకం కింద 121 బీటీ రోడ్లు మంజూరు కాగా,రూ. 17849.00 లక్షలతో పనులు చేపట్టి 32 పనులు పూర్తి చేశారు. 56 పనులు పురోగతిలో ఉండగా 33 పనులు ప్రారంభ దశలో ఉన్నాయి. ఏ ఏ పీ సి పథకం కింద 20018 ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలకు మరమ్మత్తుల కోసం రూ. 495.70 లక్షలు మంజూరు గాక పనులు చేపట్టే ప్రారంభించడం జరిగింది. ఇందులో 218 పనులు పూర్తి చేశారు

**- గిరిజన మహిళల ఆర్థిక ప్రగతికి చేయూత**

ఎం.ఎస్.ఎం.ఈ యూనిట్ మహిళలు వారి యొక్క యూనిట్లు నడిపించుకోవడానికి రూ. 20 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించి వారు మార్కెటింగ్ సౌకర్యం చేసుకోవడానికి అవకాశాలను కల్పించారు. దేవస్థానం, గిరిజన మ్యూజియం, ఐటిడిఏ కార్యాలయంలో షాపులు ఏర్పాటు చేయించి జీవనోపాధికి చేయూతనిచ్చారు. ఆర్టీపి పథకం కింద నిరుద్యోగ గిరిజన యువకులకు వాహనాలు అందించారు. మహిళలు పురుషులతో ఏమాత్రం తీసుకోకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా పిఓ రాహుల్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వాటి అమలు దిశగా ప్రయత్నించారు

**- పీసా చట్టం పకడ్బందీగా అమలు చేస్తూ**

గిరిజన గ్రామాలలో లభిస్తున్న సహజ వనరులు గిరిజనులుకే చెందేలా పిసా చట్టం ద్వారా మత్స్య సొసైటీల ఏర్పాటు, ఇసుక ర్యాంపులు మహిళలు నిర్వహించుకునేలా అవకాశాలు కల్పించి గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేశారు.

**- గిరిజన రైతాంగానికి చేదోడు వాదోడుగా**

గిరిజన రైతాంగానికి పివో రాహుల్ ఎనలేని సేవలందించారు. గిరిజన గ్రామాలలోని రైతులు పోడు భూములలో పంటలు పండించుకునే రైతులకు సేంద్రియ పంటలపై అవగాహన కల్పించి వారికి కరెంటు బోరు, మోటర్లు సబ్సిడీపై అందించడానికి ప్రత్యేక కృషి చేశారు. గిరిజన గ్రామాలలో విద్యుత్ సౌకర్యం కల్పించడం ద్వారా గిరిజన రైతాంగానికి ఎంతో మేలు చేకూరుతోంది. దమ్మపేట మండలంలోని కొండరెడ్ల గిరిజన గ్రామాలలో లెవెన్ కె.వి విద్యుత్ లైన్ ఏర్పాటు పొడిగించుటకు దాదాపు 6 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించారు. గిరిజనుల పోడు భూములలో వంద శాతం సబ్సిడీతో వ్యవసాయాన్ని ప్రోత్సహించుటకు ఇందిరా గిరిజన సౌర వికాసం పథకం ద్వారా 2 లక్షల 10 వేల గిరిజన రైతులకు, 6 లక్షల ఎకరాలకు రూ.12,600 కోట్లతో బోరు, సోలార్ మోటర్ నియోజకవర్గాల వారీగా అందించడానికి కృషి చేశారు.

**- గిరిజన ప్రగతికి అడుగులు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో కొండ రెడ్లకు 274, ఇతర తెగల గిరిజనులకు 4,750 ఇండ్ల ప్రతిపాదనలకు గ్రామాల వారీగా సర్వే నిర్వహించుటకు కృషి చేశారు. ట్రైబల్ రిలీఫ్ ఫండ్ ద్వారా గిరిజనులకు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర వైద్య



సేవల కొరకు దారిద్రరేఖకు దిగున ఉన్న గిరిజన కుటుంబాలలో 26 మందికి తక్షణ సహాయం కొరకు రూ.6.20 లక్షలు మంజూరుకు కృషి చేశారు.

దమ్మపేట మండలం, పూసుకుంట, గోగులపూడి కొండ రెడ్ల గిరిజనులకు 12 బోరు బావులు, 11 కేవీ ట్రాన్స్ఫార్మర్లు, 12 లక్షల 14 వేల రూపాయల వ్యయంతో విద్యుత్ సరఫరాకు, గోగులపూడి గ్రామంలో రూ.49 లక్షలతో కొండ రెడ్ల నిరుద్యోగ యువతీ యువకులకు వెదురుతో హస్తకళల శిక్షణ, అగర్బత్తి, సాంబ్రాణి కడ్డీలు తయారీ శిక్షణ, తేనెటీగల పెంపకం, గుబ్బల మంగమ్మ గుడి దగ్గర షాపింగ్ కాంప్లెక్స్ కై జనరేటర్ సౌకర్యం, వెదురు వస్త్రాద తయారీకి ఆధునిక యంత్రాలు అందించి వారి జీవనోపాధికి కృషి చేశారు.

**- భళా ట్రైబల్ మ్యూజియం**

అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుటకు భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలో రూ.50 లక్షల రూపాయలతో మ్యూజియం ఆధునీకరణ పనులు చేపట్టి మ్యూజియంను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటంలో సఫలికృతులయ్యారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రారంభించి మ్యూజియం అభివృద్ధికి రూ. 1 కోటి మంజూరుకు కృషి చేశారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ మ్యూజియం గిరిజన సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు పెద్దపీట వేసింది. కోయ, నాయకపోడు, లంబాడా, కొండ రెడ్లకు చెందిన గిరిజన సంస్కృతి ఇక్కడ పరిరక్షించబడుతోంది. గిరిజన సాంప్రదాయ వెదురు ఇల్లులు, మట్టి ఇల్లులు, మంచె, సెల్ఫ్ పాయింట్లు, పిల్లల బోటింగ్, బాక్స్ క్రికెట్, పిల్లల ఆట స్థలం, విలు విద్య, ఇసుక వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్ట్, గిరిజన సంస్కృతి చిత్రాలు ఏర్పాటు చేయడంతో అవి యాత్రికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అంతేకాకుండా గిరిజన ఆహార వంటకాలను ఇక్కడ అందుబాటులో ఉంచటంతో యాత్రికులు ఆస్వాదిస్తున్నారు. నిత్యం వేలాది మంది వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు ట్రైబల్ మ్యూజియం సందర్శిస్తున్నారు. విహార, విజ్ఞాన యాత్ర స్థలంగా ఈ మ్యూజియం భాసిల్లుతోంది. గిరిజనుల కోయ భాష

అంతరించిపోకుండా నేటితరం గిరిజన యువతి యువకులకు తెలియజేయడానికి ప్రతి ఆహ్వాన పత్రాలు, కోయ భాష తెలుగు లిపితో ముద్రించి వాటి పరిరక్షణకు కృషి చేశారు. భద్రాచలంలో నిర్వహించిన ముక్కోటి, శ్రీరామనవమి వేడుకల విజయవంతానికి తన వంతు కృషి చేశారు. ప్రతి గిరిజన కుటుంబాలతో ఇంటి సభ్యుడిలా వారితో కలిసి మెలిసి గిరిజన జాతరలు, భూమి పండుగలు, ఏరువాక పండుగలో పాల్గొంటూ వారి ఆచార సాంప్రదాయాలను గౌరవిస్తూ ఐటీడీఏ పీవో రాహుల్ వారిలో ఉత్సాహాన్నినింపుతున్నారు.

మంచిర్యాల జిల్లాలో స్థానిక సంస్థల జాయింట్ కలెక్టర్గా పని చేసిన కాలంలో పెద్దపల్లి ఎంపీ ఎలక్షన్లో బెల్లంపల్లి కాన్స్టెన్సీ రిటర్నింగ్ అధికారిగా ఉత్తమ సేవలందించినందుకు గాను తెలంగాణ ప్రభుత్వం తరపున గవర్నర్ చేతులు మీదుగా ఉత్తమ రిటర్నింగ్ అధికారిగా ప్రత్యేక అవార్డు అందుకున్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం..!

- ప్రైవేటు పాఠశాలల్లో అడ్డగోలుగా ఫీజుల వసూలు
- పాఠశాలల్లో యూనిఫామ్, పుస్తకాల విక్రయం
- విద్యా హక్కు చట్టానికి తూట్లు
- లబోదిబోమంటున్న తల్లిదండ్రులు
- ఉదాసీన వైఖరి లో విద్యాశాఖాధికారులు
- ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్



మణుగూరు, మన భద్రాద్రి బ్యూరో, జూన్ 24

మణుగూరు మండల పరిధిలోని ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ అన్నారు. మంగళవారం ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీ పై ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యను వ్యాపార ధోరణితో యజమాన్యాలు వ్యవహరిస్తుండటంతో సామాన్యుడికి ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోందని, ఎంతో కష్టపడి సంపాదించినదంతా పిల్లల చదువు కే ఖర్చవుతుండడంతో పేద, మధ్య తరగతి వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదివించాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారని, విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేటు విద్యా సంస్థలు ఇష్టారీతిన ఫీజులు వసూళ్లు చేస్తున్నారని. తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివించాలనే తల్లిదండ్రుల ఆకాంక్షను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని అన్నారు. పాఠశాలల్లో ఫీజులకు తోడు ఏకరూప దుస్తులు, పుస్తకాలు, నాట్ బుక్స్, బస్సు ఫీజులంటూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది అంటే చాలు తల్లిదండ్రులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయని, కొంత మంది వడ్డీలకు డబ్బులు తీసుకువచ్చి పిల్లలను చదివిస్తూ అప్పుల పాలవుతున్నారని అన్నారు. మణుగూరు మండలంలో

ప్రభుత్వ విద్యాసంస్థలను మూసివేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యసంస్థలకు కట్టబెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని వారు మండిపడ్డారు. నకిలీ బ్రోచర్లతో తోటి విద్యార్థులను తల్లిదండ్రులను తప్పు దోవ పట్టిస్తూ ప్రైవేటు యాజమాన్యాలు అడ్మిషన్ల పేర్లతోటి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా వారి దగ్గర ఉంచుకుని ఫీజు కడితే ఇస్తామని లేకుంటే ఇవ్వమని విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినేలా నడుచుకుంటున్నాయని అన్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే అధిక ఫీజులు వసూలు చేస్తున్నటువంటి ప్రైవేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీకి వ్యతిరేకంగా విద్యార్థి, విద్యార్థులను సమీకరించు కొని పోరాటం నిర్వహిస్తామని, గత ఏడాది కన్నా ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు 10 నుంచి 40 శాతం వరకు ఫీజులను పెంచాయని దీనికి తోడు పుస్తకాలు, నోటు పుస్తకాల రేట్లు 30 శాతం పెరగడం తల్లిదండ్రులకు అదనపు భారంగా మారిందన్నారు. మణుగూరు, కార్పొరేట్ పాఠశాలలో అడ్మిషన్ కోసం అధిక ఫీజులు వసూలు చేయడంతో తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారని ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని నియంత్రించకపోతే ఎన్ఎస్ఎఫ్ తరపున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జిఓ నెం (1) ప్రకారం ప్రభుత్వ పాఠశాల పుస్తకాలనే ప్రైవేటు పాఠశాలల్లో వినియోగించాలని, అడ్మిషన్ ఫీజు వసూలు చేయడానికి ఎలాంటి అనుమతులు లేవని ఆయన పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజు ఎవరైనా వసూలు చేసినట్లు

మా దృష్టికి తీసుకువస్తే తగిన చర్యలు చేపడతామని ఎంఈఓ స్వర్ణ జ్యోతి తెలిపారన్నారు.

ప్రవేట్ పాఠశాలల్లో యూనిఫామ్, పుస్తకాలు అమ్మితే చర్యలు తీసుకుంటానని, ఫీజులు నియంత్రించేందుకు తల్లిదండ్రులతో కలిసి ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు కమిటీలు వేయాలని సూచించారు. అధిక ఫీజులు ఎవరు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఎంఈఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం భద్రాది కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు జిమ్మిడి ప్రకాష్, యూత్ కార్యదర్శి గోగు సాయి, ములుగు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు బాడిస సువాస్, వంశి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఎస్టి కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలి

- అర్హులైన గిరిజనులకు కుల దృవీకరణ పత్రాలు మంజూరు చేయాలి
- నాయక పోడు సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ పున్నం రామకృష్ణ




చర్ల, మన భద్రాద్రి న్యూస్, జూన్ 24

మండల వ్యాప్తంగా నకిలీ కుల దృవీకరణ పత్రాలు పొందిన వారిని గుర్తించి అట్టి కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆదివాసి నాయకపోడు సేవా సంఘం ఆర్గనైజక సెక్రెటరీ పున్నం రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో నాయక పోడు సంఘ నాయకులతో కలిసి తహశీల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో కొంతమంది నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లను పొంది అర్హులైన గిరిజనులను మోసం చేస్తున్నారని అన్నారు. నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు పై చర్యలు తీసుకోవాలని అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందించడం జరిగిందని అన్నారు. నకిలీ ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్లు జారీ అనేది చట్ట విరుద్ధమని, నేరమని ఈ సర్టిఫికెట్లను పొందిన వ్యక్తులను జారీ చేసిన అధికారులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. నాయకులు కాపుల కృష్ణార్జున్ రావు మాట్లాడుతూ నకిలీ కుల దృవీకరణ పత్రాలు పొందిన వారు ప్రభుత్వ ఉద్యోగాలు ఇతర ప్రయోజనాలను పొందటం ద్వారా అర్హులైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా అడ్డదారిన నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని అట్టి కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల నాయక పోడు కమిటీ అధ్యక్షులు నీలం రమణయ్య, మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు, వంటకాల మహేష్, పూజారి రాము, రమేష్, గ్రామ కమిటీ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## జిల్లా పోలీస్ శాఖలో నిరుపయోగంగా ఉన్న వస్తువుల వేలం

- ఈ నెల 26వ తేదీన జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు వేలం పాట




కొత్తగూడెం, మన భద్రాద్రి బ్యూరో, జూన్ 24

జిల్లా పోలీస్ శాఖలోని వివిధ విభాగాలకు సంబంధించి నిరూపయోగంగా ఉన్న వస్తువులను ది. 26.06.2025 (గురువారం) నాడు ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ హేమచంద్రాపురం నందు బహిరంగ వేలం పాట ద్వారా విక్రయించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ వేలంపాటలో కంప్యూటర్ మానిటర్లు, సిపియు లు, కీబోర్డులు, మౌస్లు, యూపీఎస్ లు , ట్యాబ్ లు, యాపిల్ ఐ ప్యాడ్ లు, ఇన్వర్టర్ మరియు ఇన్వర్టర్ బ్యాటరీలు, డ్రాగన్ లైట్లు, టార్చ్ లైట్లు, క్లోత్ టెంట్లు, టేబుళ్లు, కుర్చీలు, బీరువాలతో పాటు ఇతర ఫర్నీచర్ సామాగ్రిని మరియు ఇతర వస్తువులకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి వేలం పాట నందు ఆసక్తి గల వ్యక్తులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డుతో పాటు ఒక జిరాక్స్ కాపీ తీసుకొని ఆర్ఎఐ అడ్మిన్ షేక్ లాల్ బాబు గారిని (8712682143) సంప్రదించగలరని తెలియజేసారు.

## అభివృద్దే మా లక్ష్యం

- దమ్మపేట మండలంలో రూ. 3.44 కోట్ల పనులకు శు భారంభం చేసిన ఎమ్మెల్యే జారె
- కూలీలతో వరినాట్లు వేసిన ఎమ్మెల్యే జారే

దమ్మపేట, మన భద్రాద్రి న్యూస్, జూన్ 24

అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ప్రజలకు అంకితం చేశారు. మొత్తం రూ. 3 కోట్లు 44 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో నిర్మితమైన సీసీ రోడ్లు, పాఠశాలల ప్రహరీ గోడలు, త్రాగునీటి కోసం నూతన బోరు మోటార్లు, పైప్ లైన్లు, హ్యాండ్ పంపులు తదితర పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు అందించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రాథమిక సౌకర్యాలు ప్రజల ఇంటి ముంగిటికి చేర్చడానికి విశేషంగా కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. రోబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలకు మంచి చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. పర్యటనలో భాగంగా మార్గం మధ్యలో వరి నాట్లు వేస్తున్న కూలీలను చూసి ఆగారు. వారితో కలిసి వరి నాట్లు వేసి వారి కష్ట సుఖాలును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నాచారం గ్రామంలో లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు. దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎస్సై స్థాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి నేను సైతం చేయూత కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మంచినీటి సౌకర్యార్థం కూలింగ్ వాటర్ క్యాన్లు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

**– సీఐ తాటిపాముల సురేష్**




**టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్, జూన్ 24**

జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు టేకులపల్లి పోలీస్ స్టేషన్లో సిఐ తాటిపాముల సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, కొకైన్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుకు బానిసైతే యువత జీవితాలు నాశనం అవుతాయని వెల్లడించారు. యువత భవిష్యత్తుని అంధకారం చేసుకోకుండా మంచి ప్రవర్తనతో నడవాలన్నారు. షెడ్ కొట్టాలలో మత్తుపదార్థాల వాడటం వల్ల కలిగే దుష్పరిణామానలలు ప్రజలకు వివరించారు. నేటి సమాజంలో మహిళలు, చిన్నపిల్లలపై జరిగే ఆకృత్యాలు వాటి నివారణ కోసం ప్రభుత్వం రూపొందించిన దిశ చట్టం, రక్షణ చర్యలపై ప్రజలకు వివరించారు. మాదక ద్రవ్యాల వాడకంతో మనిషి జీవన విధానంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని అన్నారు. మాదక ద్రవ్యాల వాడకంతో నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని అన్నారు. చెడు అలవాట్లకు బానిసై అసాంఘిక కార్యక్రమాలకు అలవాటుపడుతారని అన్నారు. ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీస్టేషన్లో సమాచారం అందించాలన్నారు. మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆలకుంట రాజేందర్, కానిస్టేబుల్స్ రమణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్ లో మొక్కలు నాటిన ఏఎంసి చైర్మెన్ బానోత్ రాంబాబు, కోరం సురేందర్

**టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్, జూన్ 24**

తెలంగాణ రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హరితహరం కార్యక్రమంలో భాగంగా వర్షాకాలం సీజన్ ప్రారంభం అవ్వడంతో టేకులపల్లి మార్కెట్ యార్డ్ మొక్కలు నాటి భవిష్యత్ అవసరాల నిమిత్తం నిర్మించబోయే, నూతన యార్డ్ స్థలాన్ని ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి మండల పార్టీ అధ్యక్షులు భుక్యా దేవా నాయక్, నాగేశ్వరావు, మార్కెట్ కమిటి సెక్రెటరి, ఈ నరేష్ కుమార్ గ్రేడ్ 3 కార్యదర్శి, సూపర్వైజర్ ఎన్ శ్రీనివాసరావు, సిబ్బంది రంజిత్, లక్ష్మయ్య, కార్తీక్, రమేష్, మోహనరావు, హరిక్రిష్ణ, మధు తదితరులు పాల్గోన్నారు



# అభివృద్ధే మా లక్ష్యం

**– దమ్మపేట మండలంలో రూ. 3.44 కోట్ల పనులకు శుభారంభం చేసిన ఎమ్మెల్యే జారె**
**– కూలీలతో వరినాట్లు వేసిన ఎమ్మెల్యే జారే**

**దమ్మపేట, మన భద్రాద్రి న్యూస్, జూన్ 24**

అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ప్రజలకు అంకితం చేశారు. మొత్తం రూ. 3 కోట్లు 44 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో నిర్మితమైన సీసీ రోడ్లు, పాఠశాలల ప్రహరీ గోడలు, త్రాగునీటి కోసం నూతన బోరు మోటార్లు, పైప్ లైన్లు, హ్యాండ్ పంపులు తదితర పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు అందించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రాథమిక సౌకర్యాలు ప్రజల ఇంటి ముంగిటికి చేర్చడానికి విశేషంగా కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. రోబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలకు మంచి చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. పర్యటనలో భాగంగా మార్గం మధ్యలో వరి నాట్లు వేస్తున్న కూలీలను చూసి ఆగారు. వారితో కలిసి వరి నాట్లు వేసి వారి కష్ట సుఖాలును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నాచారం గ్రామంలో లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు. దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎస్సై స్థాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి నేను సైతం చేయూత కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మంచినీటి సౌకర్యార్థం కూలింగ్ వాటర్ క్యాన్లు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# పేద ప్రజల పక్షాన పోరాడేది సిపిఐ పార్టీ

**– జిల్లా నాయకులు గూగులోత్ రామ్ చందర్**



**టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్, జూన్ 24**

టేకులపల్లి మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా నాయకులు గూగులోత్ రామ్ చందర్, అయిత శ్రీ రాములు అన్నారు. అర్హులైన నిరుపేదలకు రాజకీయ జోక్యం లేకుండా అందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం వారు టేకులపల్లి మండలంలోని నూతన గ్రామ శాఖ సభలు నిర్వహించి నూతన కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. పెట్రాంచలక స్టేజి శాఖ కార్యదర్శి, సహాయ కార్యదర్శిగా బాదావత్ రాందాస్, గూగులోత్ మంగ్యా, బొమ్మనపల్లి శాఖ కార్యదర్శి, సహాయ కార్యదర్శిగా దేగల రమేష్, కోరుకొప్పల వెంకటేశ్వర్లు, బిల్లుడు తండా శాఖ కార్యదర్శి, సహాయ కార్యదర్శిగా భూక్య మోతి, బానోతు విజయ, చింతా లంక శాఖ కార్యదర్శి, సహాయ కార్యదర్శిగా జోగా కృష్ణవేణి, నాగేంద్రబాబు లను ఎన్నుకున్నారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు



**ఇల్లందు మన భద్రాద్రి న్యూస్ జూన్ 24**

మంగళవారం ఇల్లందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు కోరం కనకయ్య ఆదేశాల మేరకు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల అకౌంట్ లలో రైతు భరోసా 9 రోజులలో 9వేల కోట్ల రూపాయలు రైతుల అకౌంట్ లలో జమ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏదయితే హామీ ఇచ్చారో ఆ హామీలను నెరవేర్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయభేరి కాయం అని ఇల్లందు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పులి సైదులు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ యదలపల్లి అనసూర్య, మాజీ సర్పంచులు పాయం స్వాతి, కల్తీ పద్మ, చాట్ల భాగ్యమ్మ, చీమల విజయ, పడిదల నవీన్, ప్రసన్న, పాయం ఆంజనేయులు, రుద్ర రామస్వామి, గాడిదాసు వెంకటేశ్వర్లు, మాజీ వార్డ్ మెంబెర్ తురక విజయ్, రైతులు మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ శాఖలో నిరుపయోగంగా ఉన్న వస్తువుల వేలం

**– ఈ నెల 26వ తేదీన జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు వేలం పాట**

**కొత్తగూడెం, మన భద్రాద్రి బ్యూరో, జూన్ 24**

జిల్లా పోలీస్ శాఖలోని వివిధ విభాగాలకు సంబందించి నిరూపయోగంగా ఉన్న వస్తువులను ది. 26.06.2025 (గురువారం) నాడు ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ హేమచంద్రాపురం నందు బహిరంగ వేలం పాట ద్వారా విక్రయించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ వేలంపాటలో కంప్యూటర్ మానిటర్లు, సిపియు లు, కీబోర్డులు, మౌస్లు, యూపీఎస్ లు , ట్యాబ్ లు, యాపిల్ ఐ ప్యాడ్ లు, ఇన్వర్టర్ మరియు ఇన్వర్టర్ బ్యాటరీలు, డ్రాగన్ లైట్లు, టార్చ్ లైట్లు, క్లోత్ టెంట్లు, టేబుళ్లు, కుర్చీలు, బీరువాలతో పాటు ఇతర ఫర్నీచర్ సామాగ్రిని మరియు ఇతర వస్తువులకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి వేలం పాట నందు ఆసక్తి గల వ్యక్తులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డుతో పాటు ఒక జిరాక్స్ కాపీ తీసుకొని ఆర్ఎఐ అడ్మిన్ షేక్ లాల్ బాబు గారిని (8712682143) సంప్రదించగలరని తెలియజేసారు.